

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 13 మార్చి 2025



పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై బుధవారం సాయంత్రం తన చాంబర్‌లో సమీక్షించారు. ఈ ఏడాది 23,765 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. 119 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, విడతకు 1124 మంది చొప్పున రెండు విడతలుగా 2248 మంది ఇన్విజిలేటర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. పర్యవేక్షణకు ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ష్.. గప్‌చుప్!

- అందరం సర్దుకుపోదాం రండి
- ఎన్టీఆర్ వైద్యసేవలో 'రాజీ' ఫార్ములా
- జిల్లా కేంద్రంలో ఓ టీమ్ లీడరే వసూల్ రాజా
- ఇంటిగుట్టు బయటకు వెళ్లరాదని తీర్మానం
- ఇంకోవైపు వాటాలపై ఒప్పందాలు
- అక్రమాలపై లోతుగా పరిశీలిస్తున్నామన్న డీఎంహెచ్‌వో

మెంటాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ విభాగాన్ని ఓ కుదుపు కుదిపేసిన అక్రమాల వ్యవహారం తాజాగా కొత్తమలుపు తిరిగింది. ఇకపై ఎన్టీఆర్ వైద్యసేవలో జరిగే ఏ విషయమైనా మనమధ్యే ఉండాలని, బయట పెట్టుకుంటే అందరం నష్టపోతామని అధికారులు, ఆస్పత్రుల యాజమాన్యాలు తీర్మానించుకున్నట్లు సమాచారం. ఓ వైపు నష్ట నివారణ చర్యలంటూనే మరోవైపు బేరసారాలు కూడా జరగడం వారి బరితెగింపునకు అద్దం పడుతోంది. ఒక్కో ఆస్పత్రి నెలవారీ రూ.40 వేల ముడుపులు ఇచ్చేందుకు ఒప్పందానికి వచ్చారని సమాచారం. ఇందులో రూ.20 వేలు టీమ్ లీడర్‌కు, ఇద్దరు కీలక అధికారులకు పదేసి వేల రూపాయలు చొప్పున ముట్టేలా ఒక నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. ఈ లెక్కన మొత్తం 30 నెట్వర్క్ ప్రైవేటు ఆస్పత్రుల నుంచి ఒక్కో కీలక అధికారికి నెలకు మూడు లక్షలు చొప్పున ముట్టనున్నట్లు సమాచారం. అలాగే టీమ్ లీడర్‌కు నెలకు అతనికి కేటాయించిన ఆస్పత్రుల సంఖ్యను బట్టి కనిష్ఠంగా రూ.80వేల నుంచి లక్ష రూపాయల వరకు అందనుందని తెలియవచ్చింది.

లోతుగా ఆరా

రోగమొకటి...పేరొకటి శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం వైద్యవర్గాల్లో ప్రకంపనలు సృష్టించిన నేపథ్యంలో కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు ఆఘమేఘాలపై సమావేశం ఏర్పాటు చేసి లుకలుకలుపై చర్చించిన అధికారులు వీలైనంత త్వరగా కలెక్టర్‌కు నివేదిక సమర్పించేపనిలో ఉన్నారు. ఇందులో భాగంగా అక్రమాలు, అవినీతిలో ఎవరివాటా ఎంతనేదానిపై విచారణ జరుపుతున్నారు. అలాగే అక్రమాలకు పాల్పడిన నెట్వర్క్ ఆస్పత్రుల వివరాలపైనా అరా తీస్తున్నారు. ఇటీవల కాలంలో ఆయా ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ కింద జరిగిన చికిత్సలు, ఆపరేషన్లపై కూపీ లాగుతున్నారు. టీమ్ లీడర్ల ద్వారా సదరు సమాచారాన్ని సేకరించి అవసరమైన పక్షంలో వైద్యం పొందిన వారిని ప్రత్యేకంగా కలసి మరింత అదనపు సమాచారాన్ని రాబట్టే యోచనలో ఉన్నట్టు సమాచారం.

మీడియాకు ఎలా వెళ్లింది...

ఎన్టీఆర్ వైద్యసేవలో అక్రమాలు, అవినీతి బట్టబయలు కావడం సంబంధిత వర్గాల్లో సహజంగానే కలకలం రేపింది. ఇంత సమగ్ర సమాచారం ఆంధ్రజ్యోతికి ఎలా వెళ్లిందనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ ఇన్ఫర్మేషన్ ఎవరి ద్వారా వెళ్లిందనేదానిపై దృష్టి పెట్టారని (మిగతా 8వ పేజీలో..)

లోతుగా పరిశీలించాలి

ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలో అక్రమాలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై లోతుగా పరిశీలన జరుగుతోంది. కలెక్టర్ అంబేడ్కర్ కూడా దృష్టి సారించారు. జిల్లా కోఆర్డినేటర్ నుంచి వివరణ కోరాం. పథకంలో అక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదు.

- జీవనరాణి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి



తీర్థంలో ఉద్రిక్తత

- అల్లరి మూకలను చెదరగొట్టిన ఎస్ఐ
- తనపై యువకులు దాడి చేశారని ఫిర్యాదు
- తొమ్మిది మందిపై కేసు



ఎస్ఐ, స్థానిక యువకుల మధ్య వాగ్వాదం

వేపాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గుడివాడలో మంగళవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం వద్ద అల్లరిమూకలను చెదరగొడుతున్న ఎస్ఐ బొడ్డు దేవిని స్థానిక యువకులు నిలదీశారు. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య గొడవ పెరిగింది. ఈ క్రమంలో ఓ యువకుడు గాయపడడంతో పరిస్థితి అదుపు తప్పింది. తనపై దాడి చేసినట్లు ఎస్ఐ దేవి ఫిర్యాదు చేయడంతో 9 మంది యువకులను సీఐ అరెస్టు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుడివాడ గ్రామంలో జరుగుతున్న వేణుగోపాల స్వామి తీర్థమహోత్సవం పురస్కరించుకొని మంగళవారం రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం అధికంగా హాజరయ్యారు. వేదిక వద్ద కొందరు యువకులు డ్యాన్సులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నట్లు పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు వెళ్లింది. అదుపు చేసేందుకు గ్రామానికి చేరుకున్న వల్లంపూడి ఎస్ఐ దేవి అల్లరి చేస్తున్న యువకులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన ఓ యువకుడు గాయపడ్డాడు. అతని నుదిటిపై రక్తం రావడాన్ని చూసిన కొందరు యువకులు ఆగ్రహంతో ఎస్ఐను నిలదీశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్.కోట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు గ్రామానికి చేరుకొని అల్లరి మూకలను చెదరగొట్టారు. అల్లరికి కారకులైన యువకులను అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎస్ఐ దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిది మంది యువకులపై కేసు నమోదు చేశారు.

తొమ్మిది మందిని అరెస్టు చేశాం

గుడివాడలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వేదికపై నృత్యం చేస్తున్న మహిళల పట్ల పలువురు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు బందోబస్త్ విధుల్లో ఉన్న ఎస్ఐ దేవి గమనించారు. సరికాదని అన్నందుకు మోహన్, విష్ణు, దుర్గారావు, హర్షవర్ధన్, యెర్నిబాబు, గౌరినాయుడు, సంతోష్, కిషోర్, కృష్ణమ్మ, సింహాచలంనాయుడు మరికొంతమంది ఎస్ఐ దేవిపై దౌర్జన్యం చేశారు. విధులకు ఆటంకం కలిగించి భయభ్రాంతులకు గురి చేసినట్లు ఎస్ఐ ఫిర్యాదు చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి కొత్తవలస కోర్టుకు తరలించాం.

- అప్పలనాయుడు, సీఐ, ఎస్.కోట రూరల్

కారులో 70కిలోల గంజాయి

- ఉత్తరాది రాష్ట్రాలకు తరలించే ప్రయత్నం
- బొడ్డవర చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్న పోలీసులు
- ఐదుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందాల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాధి రాష్ట్రాల్లో విక్రయించే వ్యూహంతో గంజాయిని తరలిస్తున్న ఐదుగురి ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఎస్.కోట మండలం బొడ్డవర చెక్‌పోస్టు వద్ద బుధవారం పక్కా సమాచారంతో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా అటుగా వచ్చిన కారును ఆపి సోదా చేశారు. అందులోని 70.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి కారును సీజ్ చేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ బుధవారం విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంజాయి రవాణాపై సమాచారం అందడంతో అప్రమత్తమైన ఎస్.కోట పోలీసులు బుధవారం బొడ్డవర చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. అటుగా వస్తున్న ప్రతి వాహనాన్నీ సోదా చేశారు. అంతలో అరకు నుంచి డబ్ల్యూబీ0 6జీ1206 నెంబరు గల కారు వచ్చింది. అందులో ఐదుగురు ఉన్నారు. తనిఖీల్లో భాగంగా కారు డిక్కీ తెరిచి చూశారు. బ్రౌన్ కలర్ టేపు చుట్టిన 56 గంజాయి ప్యాకెట్లు (70.100కిలోలు) గుర్తించారు. సరుకును స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశారు. ఐదుగురి నిందితులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

డబ్బుపై ఆశతో..

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినికి చెందిన షా ఆలం, బెంగళూరు ప్రాంతానికి చెందిన షేక్ అజాజ్‌లు దుప్పట్లు వ్యాపారం చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు కారులోనే వెళ్తుంటారు. వీరికి ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరికి చెందిన రంజిత్ బిశ్వాస్, నిఖిల్ తపాలీ, బిశ్వజిత్ మహాల్దార్‌తో పరిచయం ఏర్పడింది. గంజాయి వ్యాపారం చేస్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునని చెప్పడంతో ఆశ పడ్డారు. గంజాయిని ఉత్తరాధి రాష్ట్రాలకు చేర్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ప్రకారం ఒడిశాలో సేకరించిన గంజాయిని ఐదుగురు కలిసి తరలించే పనిలో ఉండగా బొడ్డవర చెక్‌పోస్టు వద్ద దొరికిపోయారు. వారి వద్ద నుంచి నాలుగు మొబైల్‌ఫోన్లు, రూ.20, 300 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ వీఎన్‌మూర్తి, ఎస్ఐ చంద్రశేఖర్, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కిడ్నీలను కాపాడుకోండి

6



- డయాబెటిస్, బీపీతో ముప్పు
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- నేడు వరల్డ్ కిడ్నీ డే

సారా రహిత జిల్లాగా మార్చండి: కలెక్టర్

7

రూ.40 కోట్లతో రక్షిత తాగునీటి పథకాలు

8


- 16వ ఆర్థిక సంఘం నిధులతో పనులు
- జడ్పీ సీఈవో వెంకటరమణ

విధికి తలొంచక విజయాల బాటలో..!

6

- పరుగుల రాణి లలిత విశేష ప్రతిభ
- అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సొంతం

రుణం తీసుకోండి ఉపాధి పొందండి



- బీసీ, ఈడబ్ల్యూసీ కార్పొరేషన్ల ద్వారా బ్యాంకు రుణాలు
- స్వయం ఉపాధి యూనిట్లపై 50శాతం రాయితీ
- జూన్ 10 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వనున్న బీసీ కార్పొరేషన్

వేపాడ మండలం పాటూరు గ్రామానికి చెందిన డి.సురేష్ పీజీ పూర్తిచేశాడు. ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఏదైనా వ్యాపారం చేయాలనుకున్నాడు. చేతిలో పెట్టుబడి లేదు. ఇలాంటి వారికి ప్రభుత్వం రాయితీతో కూడిన రుణాలు ఇవ్వనుంది. జిల్లా వ్యాప్తంగా 2883 మందికి రూ.5347.98 లక్షలను రాయితీ రుణాలుగా ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. బ్యాంకుల నుంచి రూ.2673.99 లక్షలు, ఏపీ వెనకబడిన సంక్షేమ శాఖ మరో రూ. 2673.99 లక్షలు ఇవ్వనున్నాయి.

శృంగవరపుకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వెనకబడిన తరగుతుల (బీసీ)వారితో పాటు ఆర్థికంగా వెనకబడిన (ఈడబ్ల్యూఎస్) సామాజిక వర్గాలకు చెందిన యువతకు ప్రభుత్వం రాయితీపై రుణాలు ఇవ్వనుంది. రవాణా వాహనాలు, వ్యవసాయ సంబంధిత పనిముట్లు, ట్రాక్టర్లు, జనరిక్ ఫార్మా దుకాణాలతో పాటు మేదర, కమ్మ, శాలివాహన వంటి సామాజిక వర్గాలకు వృత్తిపరమైన యంత్రాల కొనుగోలుకు రుణాలు అందించనున్నారు. ఈనెల 22 వరకు లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్ చేస్తారు. ఈనెల 23నుంచి 25 వరకు దరఖాస్తుల పరిశీలన, అర్హత, అనర్హత నిర్ధారణ ప్రక్రియ జరుగుతుంది. 26 నుంచి 30 వరకు బ్యాంకు అధికారులతో కలసి మండల ప్రజా పరిషత్, మున్సిపల్ శాఖ అధికారులు సంయుక్త పరిశీలన, 31 నుంచి ఏప్రిల్ 2వరకు అనర్హమైన దరఖాస్తుల తొలగింపు, ఏప్రిల్ 3 నుంచి 5 వరకు అర్హత కలిగిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ, ఏప్రిల్ 6 నుంచి 8వరకు కలెక్టర్ ఆమోదం, ఏప్రిల్ 9 నుంచి 11 వరకు బీసీ వెల్ఫేర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమోదం ప్రక్రియలు జరుగుతాయి.

ఏప్రిల్ 12 నుంచి 19 కార్పొరేషన్ల నుంచి బ్యాంకులకు రాయితీ విడుదల, ఏప్రిల్ 20 నుంచి 26 వరకు బ్యాంకులకు సంబంధించిన డాక్యూమెంటేషన్, ఏప్రిల్ 27 నుంచి (మిగతా 8వ పేజీలో..)

యువత పోరుకు యువకులు దూరం

- వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కార్యక్రమం
- కన్పించని వైసీపీ అనుబంధ విభాగాల నేతలు
- డిప్యూటీ మేయర్లు, అత్యధిక నగర కార్పొరేటర్లు డుమ్మా



విద్యార్థులు లేని వైసీపీ ర్యాలీ

విజయనగరం/దాసన్నపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి):

వైసీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు విజయనగరంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమం ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. యువకులు, విద్యార్థులకు జరుగుతున్న నష్టం గురించి వైసీపీ ఈ కార్యక్రమానికి పిలుపునివ్వగా యువకులు, విద్యార్థులు నిరసనలో కన్పించలేదు. పార్టీ నాయకులు, కార్యకర్తలే ముందుండి నడిపించారు. ఈ కార్యక్రమంపై కొన్నిరోజులుగా ప్రచారం నిర్వహించినా అందుకు తగ్గ స్పందన లేకపోయింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుతో పాటు మాజీ ఎమ్మె ల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనర్సయ్య, శంబంగి చిన వెంకటప్పలనాయుడు, బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, తలే రాజేష్, నెక్కల నాయుడు బాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మేయర్ వీవీ లక్ష్మీ తదితరులు హాజరయ్యారు. ముందుగా కంటోన్మెంట్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకూ వెళ్లారు. కలెక్టరేట్ గేటు వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అయితే వైసీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు కూడా ఈ కార్యక్రమానికి దూరంగా ఉండడం గమనార్హం. కార్పొరేటర్లు సుమారు 30 మంది నిరసన కార్యక్రమానికి డుమ్మాకొట్టారు. డిప్యూటీ మేయర్లు కూడా హాజరుకాలేదు.

- యువత పోరు కార్యక్రమం చాలా మందిని ఇబ్బందులకు గురిచేసింది. కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టడంతో పార్వతీపురం, ఒడిశా మార్గం మూసుకుపోయింది.

విధికి తలొంచక.. విజయాల బాటలో..!



చైనాలో జరిగిన పరుగు పందెంలో పాల్గొన్న లలిత..

పరుగుల రాణి లలిత

● అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సొంతం

పుట్టుకతోనే ఓ కంటి చూపును దూరం చేసింది విధి. అయినా ఆ చిన్నారి తన లోపాన్ని తలచుకొని కుంగిపోలేదు. తన బలమేమిటో తెలుసుకునే ప్రయత్నం చేసింది. తనకు ఉన్న పరిమిత వనరులను వినియోగించుకుంది. పరుగు పందెంపై దృష్టి పెట్టింది. పతకాలపై గురి పెట్టింది. అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. ఆమె గుల్లలంక గ్రామానికి చెందిన కిల్లక లలిత.

గుమ్మలక్ష్మీపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి)

గుల్లలంక గ్రామానికి చెందిన కిల్లక లలితకు చిన్నతనం నుంచే ఒక కన్ను కనిపించదు. తన వైకల్యాన్ని లెక్క చేయకుండా పరుగు పందెంలో రాణిస్తూ... అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తోంది. గుమ్మలక్ష్మీపురం మండలం బీరుపాడు పంచాయతీ గుల్లలంక గ్రామానికి చెందిన పేద గిరిజన కుటుంబంలో లలిత జన్మించింది. పరుగులో రాణించాలన్న తపనతో నిత్యం శ్రమించి అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ పతాకాన్ని రెపరెపలాడిస్తోంది. తాజాగా చైనాలో జరిగిన ఏషియన్ పారా అథ్లెటిక్స్‌లో రజత పతకం సాధించింది. ఆమె తల్లిదండ్రులు గోర్జ, చిట్టెమ్మ. లలిత విశాఖ నేత్రాలయ పాఠశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నేత్రాలయ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. 2018 నుంచి తన జైత్రయాత్రను ప్రారంభించిన లలిత ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో రెండు రజతాలు, ఒక కాంస్య పతకం సాధించింది. జాతీయ స్థాయిలో నాలుగు స్వర్ణాలు, 11 రజతాలు, మూడు కాంస్య పతకాలను సాధించింది.



మరిన్ని పతకాలు సాధిస్తా..

అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు తీసుకురావడానికి కృషి చేస్తున్నా. కోచ్‌లు ఎంతగానో సహకరిస్తున్నారు. త్వరలో మరికొన్ని అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనబోతున్నాను.

-కిల్లక లలిత



మంచి భవిష్యత్తు ఉంది..

లలితకు మంచి భవిష్యత్తు ఉంది. అందుకే నేను ఆమెకు కోచ్, గైడ్‌గా వ్యవహరిస్తూ... శిక్షణ ఇస్తున్నాను. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు తీసుకొస్తుందనే నమ్మకం ఉంది.

-టబ్రిష్ ఖాన్, కోచ్

పారా అథ్లెటిక్స్‌లో లలితకు కాంస్యం

గుమ్మలక్ష్మీపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో వెయ్యిపాక పంచాయతీ గుల్లలంక గ్రామానికి చెందిన కె.లలిత కాంస్య పతకం కైవసం చేసుకుంది. న్యూఢిల్లీలో జరిగిన ఈ పోటీలు మంగళవారంతో ముగిశాయి. టి-111 విభాగం 1500 మీటర్ల పరుగు పందెంలో లలిత ఐదు నిమిషాల 39 సెకెండ్లలో రేసును ముగించి తృతీయ స్థానం కైవసం చేసుకుంది.



ప్రధాని నరేంద్రమోదీతో లలిత తదితరులు (ఫైల్)

- 2023లో చైనాలో జరిగిన ఏషియన్ పారా అథ్లెటిక్స్‌లో 1500 మీటర్ల విభాగంలో రజత పతకం సాధించింది. అదే ఏడాది ప్రపంచ పారా అథ్లెటిక్స్ మీట్‌లో ఐదో స్థానం సాధించింది.
- బెంగళూరులో జరిగిన ఐదో ఇండియన్ పారా ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో రెండు పతకాలతో సత్తా చాటింది.
- గత ఏడాది బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి మీట్‌లో పరుగు పోటీల్లో స్వర్ణం, రజతం సాధించింది.
- గోవాలో జరిగిన పారా నేషనల్ 200, 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది.
- 2023లో గుజరాత్, పూణేలో జరిగిన నేషనల్ జూనియర్స్, సీనియర్స్, అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 1500, 400, 100 మీటర్ల కేటగిరీలో బంగారు పతకాలతో సత్తా చాటింది.
- చైనాలో జరిగిన పారా అథ్లెటిక్స్‌లో రజత, కాంస్య పతకాలు గెలుచుకుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నుంచి ప్రశంసలు అందుకుంది.



ఆలయ ప్రాంగణంలో భక్తజనం

పైడితల్లి ఆలయం కిటకిట

రాజాం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. మంగళవారం అర్ధరాత్రితో అధికారికంగా జాతర ముగిసినప్పటికీ పట్టణంతో పాటు సమీప గ్రామాలకు చెందిన వారంతా బుధవారం కూడా అమ్మవారి దేవాలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో భారీ సాయిలో అమ్మవారి ఆలయానికి భక్తులు చేరుకున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో మాధవరావు, సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా జాతర ప్రాంగణంలోని జెయింట్‌వీల్ కొలంబస్ తదితర వినోద సాధనాల వద్ద వందల మంది బారులు తీరారు. బొబ్బిలి కూడలి నుంచి అమ్మవారి ఆలయం వరకూ ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. టౌన్ సి.ఐ. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వచ్ఛ సుందరం.. అందరి లక్ష్యం

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

బెలగాం/పార్వతీపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుతూ.. స్వచ్ఛ సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛ సుందర పార్వతీపురం' కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేస్తూ నినాదాలు చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతో ఆరోగ్యం ముడిపడి ఉందని అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లాను దేశంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రబలుతున్న వ్యాధులకు కారణం పారిశుధ్య లోపమేనని గుర్తించినట్లు కలెక్టర్‌చెప్పారు. ప్రజలు జీవన శైలిలో మార్పులు అవసరమని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని హితవు పలికారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా రూపొందించాలని సూచించారు. స్వచ్ఛతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున రావు, డీఆర్వో కె.హేమలత, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డీఈవో ఎన్.తిరు పతి నాయుడు, డీఎంహెచ్‌వో భాస్కరరావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కన్సల్టెంట్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా... స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్‌డీలకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ప్లకార్డులతో విద్యార్థిని విద్యార్థులు

కిడ్నీలను కాపాడుకోండి



● డయాబెటిస్, బీపీతో ముప్పు
● జిల్లాలో పెరుగుతున్న బాధితులు ● నేడు వరల్డ్ కిడ్నీ డే

విజయనగరం రింగురోడ్డు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి)

మూత్రపిండాలు (కిడ్నీలు) మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన భాగం. శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను బయటకు పంపించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అటువంటి కిడ్నీలకు సమస్యలు ఏర్పడితే... ముందు జాగ్రత్తలు పాటించకుండా అశ్రద్ధ వహిస్తే.. అవి పూర్తిగా పాడై.. ప్రాణాలకే ముప్పు వస్తుంది. జిల్లాలో కిడ్నీ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లా ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో నెలకు 600కు పైగా కిడ్నీ సంబంధిత కేసులు నమోదవుతున్నాయని నెఫ్రాలజిస్టులు చెబుతున్నారు. జిల్లాలో పూర్తిగా కిడ్నీలు దెబ్బతిని... డయాలసిస్‌పై ఆధారపడిన రోగులు 450 మందికి పైగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఏటా మార్చి నెలలోని రెండో గురువారం ప్రపంచ కిడ్నీ డే నిర్వహిస్తున్నారు.

కిడ్నీ సమస్యలకు కారణాలు..

వంశంపారంపర్యం, ఆహారపు అలవాట్లు, ఊబకాయం, హైబీపీ, డయాబెటిస్, ధూమపానం, మద్యపానం, ఉప్పు, నూనె అధికంగా ఉన్న ప్రాసెస్ చేసిన ఆహారం తినడం వల్ల కిడ్నీల పనితీరు దెబ్బతింటుంది. ఇది ప్రాణాల మీదకు తెస్తుంది. ముఖ్యంగా మూత్రంలో ప్రొటీన్‌ల సంఖ్య విపరీతంగా తగ్గిపోయి, క్రమేపీ కిడ్నీల వైఫల్యానికి దారి తీస్తుంది. కిడ్నీ వ్యాధిగ్రస్థుల్లో 40 శాతం, డయాబెటిస్, 30 శాతం మంది హైబీపీ (అధిక రక్తపోటు) వ్యాధిగ్రస్తులేనని వైద్యులు చెబుతున్నారు.

● లక్షణాలు ఇవీ..

ఆకలి మందగించడం: రక్తంలో విషపూరిత పదార్థాలు పెరిగిపోతే ఆకలివేయదు. తిన్నా, వికారంగా అనిపించడం, వాంతులు అవుతాయి. బరువు తగ్గడం, తలనొప్పి వంటి సమస్యలు కనిపిస్తాయి. ఇటువంటి లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేస్తే ప్రమాదం.

నీరసం: కిడ్నీ పనితీరు సరిగ్గా లేకపోతే, రక్తహీనతకు దారితీస్తుంది. ఎర్ర రక్తకణాల సంఖ్య పడిపోయి శరీరంలోని కండరాలు, కణజాలాలకు తగినంత ఆక్సిజన్ అందదు. దీంతో నీరసం, నిస్సత్తువ ఏర్పడి చిన్న పనిచేసినా అలసటగా అనిపిస్తుంది.

మూత్రంలో మార్పు: మూత్ర విసర్జన సమయంలో నొప్పి, మంటగా అనిపిస్తుంది. రంగు, పరిమాణంలో మార్పులు వస్తాయి.

దురద, చర్మం పొడిబారడం: కిడ్నీలు సరిగ్గా పనిచేయకపోతే, చర్మం పొడిబారుతుంది. కాల్షియం, ఫాస్ఫేట్ వంటి ఖనిజాల సమతుల్యత కొరవడడమే ఇందుకు కారణం.

● పరీక్షలు ఇవే..

రక్తపరీక్షలు: ఇందులో క్రియాటినిన్ రక్త పరీక్ష ఒకటి. దీని ద్వారా రక్తంలో క్రియాటిన్ శాతం ఎంత ఉందో తెలుస్తుంది. క్రియాటిన్ శాతం పెరిగితే మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది.

గ్లోమెరులర్ ఫిల్టరేషన్ రేటు: (జీఎఫ్‌ఆర్): ఇది రక్తాన్ని వడపోసి... మూత్రపిండాల పనితీరును కొలుస్తుంది.

బ్లడ్ యూరియా నైట్రోజన్ (బన్ పరీక్ష): ఇది మూత్ర పిండాలు యూరియాను ఎంతబాగా తొలగిస్తున్నాయో తెలియజేస్తుంది.

మూత్రపరీక్షలు : మూత్రంలో ప్రొటీన్ లేదా రక్తం ఉందో? లేదో? తనిఖీ చేస్తారు. మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు ప్రొటీన్ మూత్రంలోకి వెళ్తుంది.

అల్ట్రా సౌండ్: ఇది కిడ్నీల ఆకృతిని చూడడానికి ఉపయోగపడుతుంది.

సీటీ స్కాన్: ఇది కిడ్నీల గురించి మరింత లోతుగా చూడడానికి ఉపయోగపడుతుంది.

బయాప్సీ: కిడ్నీల నమునాను తీసుకుని పరిశీలించడం ద్వారా కిడ్నీ వ్యాధిని నిర్ధారించవచ్చును.

పిల్లల్లో ఇలా..

పిల్లల్లో యూరిన్ ఇన్‌ఫెక్షన్, కిడ్నీల్లో వాపు, రాళ్లు, నెఫ్రోటిక్ సింద్రోమ్, అక్యూట్ రీనల్ ఫెయిల్యూర్, క్రానిక్ రీనల్ ఫెయిల్యూర్ తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

అవగాహన తప్పనిసరి..



కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి. తొలి దశలో వ్యాధిని గుర్తిస్తే, కిడ్నీ పూర్తిగా పాడవకుండా కాపాడవచ్చును. ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యంగా కూడా ఈ వ్యాధి వస్తుంది. ఏడాదికి రెండు పర్యాయాలు సాధారణ, బీపీ, డయాబెటిస్ పరీక్షలు చేయించుకోవాలి. మద్యపానం, ఇతర మత్తుపదార్థాలను వినియోగించే వారు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఇక్కడ చికిత్సలు, మందులను అందజేస్తున్నాం. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-డాక్టర్ శివకుమార్, నెఫ్రాలజిస్ట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయనగరం

జాగ్రత్తలు అవసరం



మనం తినే ఆహారంలో రోజుకు మూడు గ్రాముల ఉప్పు సరిపోతుంది. కానీ 12 గ్రాములకు పైగా ఉప్పును ఆహారంలో చేర్చుతున్నాం. అధిక ఉప్పు వల్ల కిడ్నీల పనితీరు మందగిస్తుంది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రోజు మొత్తంలో మూడు లీటర్ల నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు వంటి ద్రవాలు తాగడం మంచిది. ప్రధానంగా రక్తపోటు, డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవాలి. వైద్యుల సూచనలు లేకుండా సొంతంగా పెయిన్‌కిల్లర్, స్టిరాయిడ్‌లు వాడడం వల్ల కిడ్నీలు దెబ్బతినే అవకాశం ఉంది. శాఖాహారం కిడ్నీలకు మేలు చేస్తుంది. మాంసాహారాన్ని రెండు నుంచి మూడు రోజులకు పరిమితం చేయాలి.

-డాక్టర్ శ్రీకాంత్, యూరాలజిస్ట్ అండ్ ఆండ్రాలజిస్ట్, విజయనగరం



230 కేజీల రాయిని ఎత్తుతున్న క్రీడాకారుడు

హోరాహోరీగా సంగిడీ రాళ్ల పోటీలు

భోగాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామంలోని శ్రీకనక దుర్గమ్మ జాతర సందర్భంగా బుధవారం సంగిడీ రాళ్ల పోటీలు వేలాది మంది భక్తులు, క్రీడాభిమానుల మధ్య ఉత్కంఠభరితంగా జరిగాయి. 130 కేజీల వరకు బరువు గల రాళ్లను తీయడం, పోటు, ఎత్తడానికి క్రీడాకారులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. ఇసురు, పోటు, తీత అనే మూడు విభాగాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కందుల రఘుబాబు, కొమ్మూరు సుభోషణరావు, పడాల భానుప్రకాశ్, క్రీడాకారులు, క్రీడాభిమానులు, భక్తులు, పాల్గొన్నారు.



పోటీలను తిలకిస్తున్న ప్రేక్షకులు

సారా రహిత జిల్లాగా మార్చండి

కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని అధికారులను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సారాకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబరు 1440పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. సారా తయారీ, వినియోగించడం లేదని పంచాయతీల నుంచి తీర్మానాలను తీసుకోవాలన్నారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియను ముగించాలన్నారు. ఇప్పటికే సారా తయారీ, వినియోగం జరుగుతున్నట్టు గుర్తించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అటవీ ప్రాంతంలో ఎక్కడైనా సారా తయారీ జరిగితే దానికి అటవీ శాఖ బాధ్యత వహించాలన్నారు. అటవీ, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా తనిఖీ చేయాలన్నారు. ఈ సందర్భంగా నవోదయం 2.0కు సంబంధించిన వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎక్సైజ్ సహాయ కమిషనర్ రామచంద్రరావు, ఇన్‌చార్జి జేసీ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, అటవీ శాఖ అధికారి కొండలరావు, డీఈవో మాణిక్యంనాయుడు, డీఎంహెచ్‌వో జీవనరాణి, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి తదితరులున్నారు.

జాతీయ రహదారిపై 64 సీసీ కెమెరాలు

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ,కారణాలను గుర్తించేందుకు జాతీయ రహదారిపై 64 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. హిట్ అండ్ రన్ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. విజయనగరం డివిజన్‌లో గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న కేసులపై చర్చించారు. హిట్ అండ్ రన్‌కు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉంచకూడదన్నారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, టీడీసీ మణికుమార్ తదితరులున్నారు.

పీఎంఏవై ఇళ్లకు అదనపు సాయం..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గతంలో మంజూరైన ఇళ్లు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయాన్ని ప్రకటించిందని కలెక్టర్ అంబేడ్కర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. దీంతో జిల్లాలో 15,226 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. జిల్లాలో 12,240 మంది బీసీలకు, 2231 మంది ఎస్సీలకు ఇంటికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తారని తెలిపారు. 565 మంది షెడ్యూల్ తెగల వారికి రూ.75 వేలు చొప్పున, 190 మంది ఆదిమ తెగల వారికి పీఎం జన్‌మన్ కింద ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. గతంలో మంజూరైన నిర్మాణంలోని ఇళ్లకు మాత్రమే అదనపు ఆర్థిక సాయం వర్తిస్తుందని వివరించారు. గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్, సంక్షేమ కార్యదర్శులు ఈనెల 18 నుంచి 22 వరకూ ఇళ్ల నిర్మాణాల ఫొటోలు తీసి హౌసింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

పర్యటకాభివృద్ధికి ముందుకురండి

జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ఏపి మోడల్‌లో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చే వారికి అవసరమయ్యే భూమి, ఇతర అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. జిల్లాలోని అనేకపర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. బీచ్ టూరిజం కింద ఎవరైనా ముందుకు వస్తే మంచి లాభదాయకంగా ఉంటుందన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి పర్యాటక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రధానంగా గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి రిజర్వాయర్ వద్ద ఏకో టూరిజం అభివృద్ధి కోసం రూ.23 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఇందులో రోప్‌వే, చిల్డ్రన్ పార్క్, బర్డ్ పార్క్, రెస్టారెంట్, క్లబ్ హౌస్‌లు తదితర పనులు కోసం 10.63 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. టెంపుల్ టూరిజం కింద రామతీర్థం దేవాలయం అభివృద్ధి కోసం రూ.10 కోట్లతో, రామనారాయణం వద్ద ఉన్న గోపాలరాజు కోనేరు అభివృద్ధికి 8.50 ఎకరాల విస్తీర్ణంలో రూ.6 కోట్లతో, చింతపల్లి బీచ్ టూరిజం కింద రూ.6 కోట్లతో కాటేజీల నిర్మాణాలు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి కుమారస్వామి తదితరులు ఉన్నారు.



ఎస్పీతో బీజేపీ నాయకులు

ఎస్పీని కలిసిన బీజేపీ నాయకులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ, పార్లమెంట్ కన్వీనరు శంబర లక్ష్మీనరసింహం, గోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆనకట్టు పనుల పరిశీలన

సంతకవిటి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం ఆనకట్టు హెడ్ స్లూయిస్ మార్పిడి పనులను బుధవారం ఏఈఈ రాంబాబు పరిశీలించారు. కుడి ప్రధాన కాలువకు నీటిని మళ్లించే పాత హెడ్ స్లూయిస్‌ను తొలగించి నాణ్యతతో కూడిన కొత్త హెడ్ స్లూయిస్‌లను త్వరితగతిన అమర్చాలని కాంట్రాక్టర్ బాషాకు సూచించారు.

జేఎన్‌టీయూలో 'క్రిసెన్స్' సదస్సు

విజయనగరం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూలో బుధవారం క్రిసెన్స్-2కె25 సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ పి.అరుణకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూ వీసీ రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఇటువంటి సదస్సుల ద్వారా అటు అధ్యాపకులకు, ఇటు విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, పోలా ఆనందనాయుడు, డి.శివరాం, వి.నారాయణరావు, తనూజ్ హేమంత్, పేడాడ బలశ్రీ పాల్గొన్నారు.

పాఠశాలకు పరికరాలు

భోగాపురం, మార్చి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డికంచేరు ప్రభుత్వ పాఠశాలకు ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ జీఎంఆర్, ఎల్‌అండ్‌టీ సంస్థ సంయుక్తంగా బుధవారం రూ.2.5 లక్షల విలువైన పరికరాలను అందజేశారు. కంప్యూటర్, ప్రింటర్, ప్రాజెక్ట్ తదితర వాటిని సంబంధిత పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి

గరివిడి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు, ఆరోగ్యంపై హెచ్‌ఎం పివి.బాబురావు పలు సూచనలు చేశారు. అనంతరం సర్పంచ్ పాండ్రంకి కామేశ్వరరావు విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి రూ.5 వేల విలువైన అట్టలు, పెన్నులు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించనుందని జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు హాల్ టిక్కెట్ విధిగా ఉండాలని, కండక్టర్ అడిగినప్పుడు చూపించాలన్నారు.

విద్యార్థినులకు కిట్స్ పంపిణీ

కొత్తవలస, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు బుధవారం నందిని ఫౌండేషన్ ద్వారా షూస్, సాక్స్, టీషర్టులు, పెన్‌లు, పుస్తకాలు, శానిటరీ న్యాపికిన్స్ పంపిణీ చేశారు. హెచ్‌పీసీఎల్, మహేంద్ర అండ్ మహేంద్ర ఆర్థికసాయంతో అందజేస్తున్నట్టు నందిని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస హైస్కూల్ హెచ్‌ఎం ఈశ్వరరావు, ఫౌండేషన్ ప్రతినిధులు సునీత, భాను, ప్రతిమ, పార్వతి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్స్ సమస్యలను పరిష్కరించాలని ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.అప్పలనాయుడు ఒక ప్రకటనలో కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణను కొనసాగించాలన్నారు.

పైడితల్లమ్మను దర్శించుకున్న ఎంపీ



ఆలయంలో ఎంపీ కలిశెట్టి, కర్రోతు బంగార్రాజు

భోగాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పోలిపల్లిలో పైడితల్లమ్మను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ తదితరులున్నారు.

వైసీపీ ఆందోళన.. విడ్డూరం



మాట్లాడుతున్న రవికుమార్

విజయనగరం దాసన్నపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో పెట్టిన ఫీజు బకాయిలపై తిరిగి వైసీపీ ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందని జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, ఏపీ కొప్పల వెలమ వెల్ఫేర్ కార్పొరేషన్ డాక్టరు రవికుమార్ మిడతాన అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని యువత, విద్యార్థులు ఇప్పుడు జగన్‌రెడ్డికి గుర్తుకు వస్తున్నారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించిందన్నారు. ఆయనతో పాటు నాయకులు కాళిదాసు, రామునాయుడు, అప్పన్నదొర తదితరులున్నారు.

ఉచితంగా గ్లకోమా పరీక్షలు



గ్లకోమా పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గ్లకోమా నివారణ దినోత్సవం సందర్భంగా నగరంలోని తోటపాలెం వద్ద గల స్వామి కంటి ఆసుపత్రిలో ఉచితంగా గ్లకోమా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండీ, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ మంచు కుమారస్వామి మాట్లాడుతూ గ్లకోమాను ముందుగా గుర్తిస్తే అంధత్వం నష్టాన్ని ఆపవచ్చునన్నారు. గ్లకోమా వల్ల కంటి చూపు పూర్తిగా దెబ్బతిని శాశ్వత అంధత్వం ఏర్పడుతుందన్నారు. గ్లకోమా రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హైబీపీ, డయాబెటిక్‌ను అదుపులో ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 30 మందికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో బాబ్జీ పాల్గొన్నారు.

గ్లకోమాతో అంధత్వం

● రాజాం: నీటి కాసుల(గ్లకోమా) వ్యాధి నిశ్శబ్దంగా దృష్టిని దోచేస్తుందని సకాలంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని రొటేరియన్, ఆప్తాలమిస్ట్ సప్పటి వసంతరావు అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు సందర్భంగా బుధవారం పొగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎందువ సత్యారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన



లైన్లను పరిశీలిస్తున్న విద్యుత్తు సిబ్బంది

భోగాపురం, మార్చి12 (ఆంధ్రజ్యోతి): భోగాపురం విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం ఏఈ మస్తాన్‌వలీ, సిబ్బంది పరిశీలించారు. ఈనెల 8న 'ఆంధ్రజ్యోతి'లో 'విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సమస్యను గుర్తించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద లైన్‌లను పరిశీలించారు.

మంత్రులను కలిసిన విసినిగిరి



చిత్రపటాలను అందజేస్తున్న శ్రీనివాసరావు

చీపురుపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌లను చీపురుపల్లి జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు బుధవారం కలిశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లలో ఉన్న వీరిని శ్రీనివాసరావు బుధవారం పిఠాపురంలో కలిశారు. ఈ సందర్భంగా చీపురుపల్లిలో పార్టీ పరిస్థితిపై మంత్రులు ఆరా తీశారు. అనంతరం చీపురుపల్లి ఇలవేల్పు శ్రీకనకమహలక్ష్మి అమ్మవారి చిత్రపటాలను శ్రీనివాసరావు మంత్రులకు అందజేశారు. మంత్రులను కలిసిన వారిలో యడ్ల సంతోష్, మీసాల సూరినాయుడు, కింతలి వాసు, సత్యం, కూర్మారావు, జనసేన శంకర్ తదితరులున్నారు.

ఉద్యోగాలకు 41 మంది ఎంపిక



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

శృంగవరపుకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ కళాశాలకు చెందిన జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో బుధవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా జరిగింది. 154 మంది వరకు నిరుద్యోగులు హజరయ్యారు. అందులో 41 మంది దివిస్ ల్యాబరేటరీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు, అధ్యాపకుడు ఈరన్న, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి అరుణ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



నెల్లిమర్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలో నిర్మించిన విద్యా గణపతి సరస్వతి పూర్వక నగరేశ్వర సహిత వాసవి కన్యకా పరమేశ్వరి ఆయలంలో కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు సువాడ రవిశేఖర్, పార్టీ నాయకులు లంక అప్పలనాయుడు, ఆల్తి శ్రీనివాసరావు, రెల్లి వెంకటేశ్, వైసీపీ నాయకులు చిక్కాల సాంబశివరావు, పలువురు కౌన్సిలర్లు, ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

● వేపాడ: మండలంలోని వెల్దాం-వీలుపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10.45 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం ఎడ్ల పరుగు పందేల పోటీలు నిర్వహించారు.

ముగిసిన కోదండరామాలయ వార్షికోత్సవం



రామాలయంలో పూజలు దృశ్యం

రేగిడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొమిరి-వెంకటాపురం గ్రామంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న కోదండ రామాలయ వార్షికోత్సవం బుధవారంతో ముగిసింది. ఆఖరి రోజు బాలభోగం, హోమం, చక్రస్నానాలు, పూర్ణహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పఠనంలో 'జయపవన్' రికార్డు



జయ పవన్‌కల్యాణ్

విజయనగరం రింగురోడ్డు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ చాలీసా పఠించడంలో నగరానికి చెందిన జయ పవన్‌కల్యాణ్ ప్రపంచ రికార్డు సాధించారు. 55 సెకెండ్ల వ్యవధిలో హనుమాన్ చాలీసాను పఠించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీల్లో ఆయన పాల్గొని హనుమాన్ చాలీసాను అతి తక్కువ నిడివిలో పూర్తిగా పఠించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. గతంలో బీహార్‌కు చెందిన అబ్బాయి పేరిట 59 సెకెండ్ల వ్యవధిలో హనుమాన్ చాలీసా పఠనం రికార్డు ఉండేది. ఆ రికార్డ్‌ను జయపవన్ అధిగమించారు. జయపవన్ తండ్రి తాతబాబు నగరపాలక సంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

వెలుగులు విరజిమ్మిన బాణసంచా



బాణసంచా వెలుగులను వీక్షిస్తున్న భక్తులు

రాజాం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని పోలిపల్లి పైడితల్లి జాతర ప్రాంగణంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక బాణాసంచా కాల్చారు. అమ్మవారి ఘటోత్సవ ప్రారంభంతో బాణసంచా కాల్చడం మొదలుపెట్టి కార్యక్రమం పూర్తయ్యేంత వరకూ కాల్చారు. దాదాపు రెండు గంటల పాటు బాణసంచా వెలుగులు విరజిమ్మాయి. బాంబుల ధ్వనితో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రవికిరణ్ పర్యవేక్షించారు. జాతర ప్రాంతంలో తొలిసారిగా 27 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లు ఏర్పాటు చేయడంతో జాతర ప్రశాంతంగా జరిగింది. ఏటా దేవదాయశాఖ, ఎస్‌వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర జరిగేది. ఈ ఏడాది వారితో పాటు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, అతడి సోదరుడు, సీనియర్ నాయకుడు కోండ్రు జగదీశ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని జాతర ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి బొబ్బిలి జంక్షన్ వరకు కిలోమీటరు మేర లైటింగ్, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయించారు. సుమారు రూ. 4 లక్షలు విలువ చేసే బాణాసంచా సమకూర్చారు.

క్రైం న్యూస్

చిన్నారి మృతదేహం లభ్యం

వంగర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్ కుడి కాలువలో మంగళవారం గల్లంతైన ఏడేళ్ల చిన్నారి కళింగ సైన మృతదేహం ఎట్టకేలకు బుధవారం లభించింది. మంగళవారం ఇద్దరు పిల్లలతో తల్లి మడ్డువలస కాలువలో దూకి ఆత్మహత్యకు తెగబడ్డ విషయం తెలిసిందే. విషయాన్ని గుర్తించిన మత్స్యకారులు తల్లి, కొడుకును మాత్రమే కాపాడగలిగారు. చిన్నారి ఆచూకీ కోసం సాయంత్రం వరకు వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం వేకువజామున కుటుంబసభ్యులు, స్థానికులు మళ్లీ మడ్డువలస కాలువలో వెతకడంతో చిన్నారి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ షేక్‌శంకర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి రాజాం తరలించారు.

నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యరెడ్డి

గజపతినగరం, మార్చి12 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం పట్టణంలో గతనెల 21న జాతీయరహదారి, మెంటాడ రోడ్డులో 8 షాపుల్లో చోరీ కేసుల్లో అంతర్రాష్ట నిందితులను అరెస్టు చేసినట్టు బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్తవలస పట్టణానికి చెందిన గులిపల్లి కిరణ్‌కుమార్, శ్రీను నాయక్, రావుల్ రమణ, విశాఖ పట్నం జిల్లా అల్లిపురం ప్రాంతానికి చెందిన షేక్‌బాషాను అంతరాష్ట్ర దొంగలుగా గుర్తించామన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడులో చోరీలకు పాల్పడేవారన్నారు. మనరాష్ట్రంలో తుని నెల్లూరు, విజయనగరం వన్‌టౌన్, బొండపల్లి, గజపతినగరం, ఎస్.కోట ప్రాంతాల్లో చోరీలకు పాల్పడటంతో వీరిపై 9 కేసులు నమోదై ఉన్నాయన్నారు. గజపతినగరంలో గతంలో జరిగిన ఎలక్ట్రికల్ షాపులో చోరీ కేసులో నిందితులను పట్టుకుని విచారించడంతో వారిచ్చిన సమాచారం మేరకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. గజపతినగరం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.88,620 నగదు, ఒక ల్యాప్‌టాప్, 9 స్మార్ట్ ఫోన్‌లు, 3 గోల్డ్ కలర్ వాచీలను రికవరీ చేశామన్నారు. ఇంకా మరో ఇద్దరు నిందితులు వెంకటేశ్ శివగౌడ్, లంబు రవి పరారీలో ఉన్నారన్నారు. వారినీ త్వరలో పట్టుకుంటామన్నారు. సమావేశంలో సీఐ రమణ, ఎస్‌ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పశువుల పాకలు, ఎడ్ల బండ్లు దగ్ధం



బాధితులతో మాట్లాడుతున్న కొండలరావు

జామి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్టాడలో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల వివరాల మేరకు మంగళవారం రాత్రి 11గంటల సమయంలో గ్రామ సమీపంలోని రైతుల కల్లాలు వద్ద ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ప్రమాదంలో పోటుపురెడ్డి నారితల్లి, కృష్ణ, శ్రీను, సీతబాబు, రామునాయుడు, అప్పారావులకు చెందిన పశువుల పాకలు, రెండు ఎడ్ల బండ్లు, గడ్డి మేట్లు కాలిపోయాయని తెలిపారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకసిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారన్నారు. ప్రమాదంలో రూ. 15 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని తెలుస్తోంది. బాధితులను మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎంపీపీ కొండలరావు పరామర్శించారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. బాధితులకు జరిగిన నష్టాన్ని తహసీల్దార్ కృష్ణలత నమోదు చేశారు.

ఆర్వోబీపై చిక్కుకున్న భారీ వాహనం

● గంటపాటు ట్రాఫిక్ జామ్



రోడ్డుకు అడ్డంగా నిలిచిన వాహనం

చీపురుపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని పాత ఆర్వోబీపై బుధవారం భారీ వాహనం చిక్కుకుంది. దాంతో గంట పాటు ట్రాఫిక్ జామయ్యింది. రాజాం వైపు నుంచి విజయనగరం వైపు వెళ్తున్న ఒక భారీ వాహనం పాత ఆర్వోబీ వద్ద వాహనాల నిరోధం వద్ద చిక్కుకుపోయింది. ఆ వాహనాన్ని వెనక్కి మళ్లించడానికి డ్రైవర్ ప్రయత్నించినప్పటికీ కుదర లేదు. దీంతో అటు రైల్వేస్టేషన్ నుంచి ఇటు పట్టణంలోని గాంధీ బొమ్మ వరకూ సుమారు గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. చివరికి కొత్త ఆర్వోబీ నిర్మాణానికి వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌తో అక్కడున్న అడ్డంకులను తొలగించి భారీ వాహనాన్ని పక్కకు మళ్లించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


వ్యక్తిపై దాడి: కేసు నమోదు

లక్కవరపుకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలోని నెయ్యిలవీధికి చెందిన జన శ్రీనుపై అదే ప్రాంతానికి చెందిన బెహరా అప్పలరాజు దాడికి పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నవీన్‌పడాల్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన బెహరా అప్పలరాజు మంగళవారం రాత్రి తనపై దాడి చేశాడని ఫిర్యాదుదారుడు పేర్కొన్నాడన్నారు. బలమైన గాయాలు కావడంతో ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం కేంద్ర ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

దత్తిరాజేరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.బూర్జవలసలో అగ్ని ప్రమాద బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వంట సామాన్లు, టార్పాలిన్లు, రగ్గులను అందజేసింది. మాజీ ఎంపీపీ బెజవాడ రాజేశ్వరి, సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, టీడీపీ నాయకులు బెజవాడ ఈశ్వరరావు చేతుల మీదుగా అగ్ని ప్రమాద బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎం.రాము, సీహెచ్ మన్మథరావు, సచివాలయ సిబ్బంది మిత్తిరెడ్డి హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంతో వ్యవసాయం లాభసాటి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీన్ అనీల్‌కుమార్

నెల్లిమర్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డ్రోన్ల పరిజ్ఞానంతో వివిధ రంగాలలో ఎలా నైపుణ్యాలను పెంపొందించవచ్చు అనే అంశంపై సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో డీన్ ప్రొఫెసర్ జె.అనీల్‌కుమార్ వివరించారు. బుధవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, సెంచూరియన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న వింగ్స్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎంపవరింగ్ స్కిల్స్ త్రూ డ్రోన్ టెక్నాలజీ అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించే కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు డ్రోన్ల టెక్నాలజీ వివిధ రంగాలకు విస్తరిస్తోందన్నారు. డ్రోన్లతో వ్యవసాయం, రక్షణ, సర్వే డ్రోన్ల ద్వారా ఎలాంటి ఫలితాలు రాబట్టగలమో వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ కొర్ల హర్షవర్ధన్, డాక్టర్ సోనియా పాణిగ్రాహి, ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.లత, డాక్టర్ ప్రేమ చటర్జీ, డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ, డాక్టర్ ఎంజి.నాయుడు, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.దివ్య, డాక్టర్ ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ

లక్కవరపుకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మాదేవిపేటలో గల మహాత్మా పూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం విశాఖ కంటి ఆసుపత్రి సిబ్బంది 21 విద్యార్థినులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాత్రో ఉన్నారు.

రుణం తీసుకోండి.. ఉపాధి పొందండి

(5వ పేజీ తరువాయి)

30 వరకు కార్పొరేషన్‌లు మంజూరు చేసిన రాయితీతో పాటు బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు రుణాలు, మే 1 నుంచి 10 వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు అందించనున్న యూనిట్‌ల మేళాల నిర్వహణ, మే 11నుంచి 20 వరకు లబ్ధిదారులకు సంబంధించిన యూనిట్‌లను జియోట్యాగింగ్, ఫొటోలను ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్, మే 21 నుంచి జూన్ 10 వరకు లబ్ధిదారులకు అందించిన యూనిట్‌ల వినియోగంపై పరిశీలన ఉంటుంది. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కలెక్టరేట్ నుంచి మండల పరిషత్ కార్యాలయాలకు మంగళవారం అందాయి.

మహిళలకు కుట్టుమిషన్‌పై శిక్షణ

ఏపీ బ్లాక్‌వర్డ్ క్లాసెస్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ రాష్ట్రంలోని బీసీ మహిళలకు బేసిక్ టైలరింగ్ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 46044 మందికి ఈ శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. రోజుకు 8గంటలు చొప్పున 45రోజులు, రోజుకు 6గంటల చొప్పున 60 రోజులు, రోజుకు 4గంటల చొప్పున 90 రోజులు(మూడు గ్రూపులుగా) శిక్షణ ఉంటుంది. వెనకబడిన తరగతులకు చెందిన మహిళలు మాత్రమే ఈ పథకానికి అర్హులు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. ఇతర స్వయం ఉపాధి పథకాలకు వర్తించే ఓబీఎంఎంఎస్ ప్రకారం కుటుంబ ఆదాయం ఉండాలి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఎంపిడివో, మున్సిపల్ కమిషనర్‌లు మహిళా లబ్ధిదారులను గుర్తిస్తారు. 75శాతం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మోడల్ కుట్టుమిషన్‌లను నియోజకవర్గాల వారీగా పంపిణీ చేయనున్నారు.

ష్.. గప్‌చుప్!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తోంది. ఇప్పటికే ఇద్దరుముగ్గురిని వాకబుచేసిన అధికారులు మిగిలిన వారిని కూడా విచారించేపనిలో ఉన్నారు. కాగా ఎన్టీఆర్ వైద్యసేవలో మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్వర్క్‌లో చేరాలంటే ముందుగానే 2 నుంచి 3 లక్షల రూపాయల వరకు జిల్లా అధికారుల చేయితడపనిదే పని జరగడం లేదని ఆసుపత్రి వర్గాల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ వైద్యసేవలో కీలకంగా ఉన్న ఓ అధికారి పాలకొండలో తన సతీమణిని ఎండీగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహిస్తున్నాడు. చీపురపల్లిలో ఓ ప్రముఖ ఆస్పత్రిలో భాగస్వామ్యానికి కూడా ప్రయత్నించినప్పటికీ డీల్ కుదరలేదని వైద్య ఆరోగ్య శాఖలో ప్రచారం జరుగుతోంది. మొత్తమ్మీద ఓవైపు విచారణ, మరోవైపు నష్టనివారణ, ఇంకోవైపు పంపకాలపై ఒప్పందం.. వెరసి ఎన్టీఆర్ వైద్యసేవలో ఓ రకమైన హైడ్రామా నడుస్తోందని చెప్పవచ్చు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో కలెక్టర్‌కు ఇవ్వనున్న నివేదికలో పారదర్శకతపై ముందే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

రామభద్రపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొట్టక్కి గ్రామంలో ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ గిరిధర్‌కు వినతిపత్రం అందజేశారు. 537 సర్వే నెంబరులో సుమారు 50 ఎకరాల డీపట్టా భూమిని సాలూరుకు చెందిన కొంతమంది ఆక్రమించారని, ఆ ఆక్రమణలను తొలగించి ఆ భూములు పేదలకు పంపిణీ చేయాలని ఆయన కోరారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి టొంపల నాగరాజు గత కొన్నేళ్లుగా బినామీ పేర్లతో డిపట్టా భూములు పొందారని, ఆ పట్టాలను రద్దుచేసి భూమి లేని నిరుపేదలకు ఆ భూములు పంపిణీ చేయాలని ఆయన కోరారు. అలాగే గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో కొట్టక్కి గ్రామ సర్వేయర్ ఎన్నో అవకతవకలకు పాల్పడ్డారని, అతనిపై కూడా శాఖాపరమైన విచారణ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో అలమండ శంకరరావు, సామిరెడ్డి అప్పలనాయుడు, సోములు, ఇష్టం త్రినాథ పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బొబ్బిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నీటికాసుల వ్యాధి(గ్లకోమా) వారోత్సవాలను ఈనెల 15 వరకు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నా రు.. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ప్రముఖ కంటి వైద్యనిపుణుడు కోటగిరి వెంకటఅప్పారావు అన్నారు. బుధవారం స్థానిక బొబ్బిలి కంటి ఆసుపత్రి ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ వ్యాధి ఏ వయస్సు వారికైనా సోకే అవకాశం ఉందన్నా రు. కంటికి గాయాలు తగలకుండా చూసుకోవాలని, ఒత్తిడి గురికావద్దని, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా వంటివి మంచిదన్నారు. రోటరీక్లబ్ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు, రోటరీ సేవా విభాగం ప్రతినిధులు గెంబలి శ్రీనివాసరావు, శ్రీహరి, మరడాన శ్రీనివాసరావు, ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.


గ్రామసభలు వినియోగించుకోండి



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో జీవీఎస్ రామమోహనరావు అన్నారు. బుధవారం అలజంగి గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. వివిధ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎం.శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్ష విరమణ



జామియా మసీదులో ఉపవాస దీక్ష విరమిస్తున్న ముస్లింలు

బొబ్బిలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జామియా మసీదులో బుధవారం సాయంత్రం పవిత్ర రంజాన్ మాసం 11 రోజుల ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇఫ్తార్ ఉపవాస దీక్షను విరమించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విందులో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

బొబ్బిలి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రంగరాయపురం ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం పి.నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియాకు సంబంధించి రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించి గుర్తింపు కార్డులో పొందుపర్చి, కార్డులను ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

బొబ్బిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల ప్రభావంగా ఎటువంటి అనర్థాలు సంక్రమిస్తాయన్న దానిపై పోలీసులు సంచార వాహనంపై లఘు చిత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక ఇందిరమ్మకాలనీలో బుధవారం సాయంత్రం ఎస్ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో వీటిని ప్రదర్శించారు.

మహిళల అభివృద్ధిపై దృష్టిపెట్టండి

అసెంబ్లీలో మన వాణి

- నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి



మాట్లాడుతున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధిపై దృష్టిపెట్టాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. బుధవారం ఆమె అసెంబ్లీలో మహిళా సాధికారతపై మాట్లాడారు. డ్వాక్రా సంఘాల ద్వారా వారిని ప్రోత్సాహిస్తున్నప్పటికీ ఇంకా మహిళలు అభివృద్ధి చెందడం లేదన్నారు. వారికి చేయూత అందించేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. అలాగే పూసపాటిరేగ మండలానికి మోడల్ స్కూల్, భోగాపురం మండలానికి జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కోరారు. విశాఖపట్టణం-భోగాపురం ఐటీ కారిడార్‌లో కొత్త వ్యాపారవేత్తలకు ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఐటీ శాఖ మంత్రిని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటుందని ఆమె ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

తప్పుల తడకలుగా రీసర్వే

- విజయనగరం ఎమ్మెల్యే అదితి



మాట్లాడుతున్న విజయనగరం ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విజయనగరం మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే తప్పుల తడకగా మారిందని, దీనిపై కూటమి ప్రభుత్వం తాజాగా సర్వే చేయాలని నిర్ణయించడం హర్షణీయమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. బుధవారం అసెంబ్లీలో రెవెన్యూ శాఖపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలు పరిష్కారం కోరుతూ రెవెన్యూ సదస్సులు జరిగాయన్నారు. అయితే ఆయా సదస్సుల్లో వచ్చిన వినతులను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. వీటితో పాటు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, టీడీపీ హయాంలో మహిళల కోసం అమలు చేసిన పథకాలు, విజయనగరంలోని కోరుకొండ సైనిక స్కూల్‌లో విద్యార్థినిలకు ప్రవేశాలపై ఆమె అసెంబ్లీలో ప్రస్తావించారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తరించాలి

- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



మాట్లాడుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారకరామారావు 1986లో పెదవేగిలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయిల్‌పామ్ తోటల సాగును గ్రామగ్రామానికి విస్తరింపజేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన అసెంబ్లీలో ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై ప్రస్తావించారు. ఏపీలో రెండున్నర లక్షల హెక్టార్లలో రెండు లక్షలమంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, పది లక్షల మంది కూలీలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నారని ఆయన వివరించారు. 2018లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఐదు పామాయిల్ ఫ్యాక్టరీలకు 200 టన్నుల చొప్పున అమ్ముకునే అవకాశం కల్పించారన్నారు. ఏపీలో నూతన ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ ఏర్పడి ఓఈఆర్ పెరిగినంతవరకు తెలంగాణలో మాదిరిగా మన రైతులకు కూడా ధరలను చెల్లించాలని కోరారు. నూతనంగా నిర్మించిన ప్రైవేటు ఫ్యాక్టరీలలో అధిక ఓఈఆర్ ఆధారంగా టన్నుకు కనీస మద్దతు ధర రూ.20వేలు చొప్పున ఇవ్వాలని ఆయన కోరారు.

రూ.40కోట్లతో రక్షిత తాగునీటి పథకాలు

- జడ్పీ సీఈవో వెంకటరమణ



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో వెంకటరమణ

రామభద్రపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది కాంప్రెన్సివ్ ప్రొటెక్టివ్ వాటర్ స్కీం కింద రూ.40 కోట్లతో 34 తాగు నీటి పథకాలు మంజూరైనట్టు జడ్పీ ముఖ్య కార్య నిర్వాహణాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. 16వ ఆర్థిక సంఘం నిధులతో 34 తాగునీటి పథకాలు మంజూరయ్యాయన్నారు. ప్రతి మండలంలో ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, తాగునీటి సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. పీ4 సర్వేపై అపోహలు వద్దని, పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ఈ సర్వే చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 38.85 శాతం పీ4 సర్వే పూర్తయిందని తెలిపారు. జిల్లాలో డిజిటల్ అసిస్టెంట్ల పోస్టుల కొరత ఉందని, త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీపై అధికారులు దృష్టిసారించి సంపద సృష్టించే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయ పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డీపీఆర్‌సీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బీఎస్‌కే పట్నాయక్, ఎంపీడీవో రత్నం, ఏవో సన్యాసిరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

బొబ్బిలి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలం కేటాయిస్తామని బొబ్బిలి ఆర్డీవో జీవీఎస్ రామమోహనరావు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. మెట్ట ప్రాంతంలో ఐదు ఎకరాలు, మాగాణి ప్రాంతంలో 2.5 ఎకరాలు మించి భూమి ఉండని వారు, గతంలో ఎప్పుడూ ఇళ్ల స్థలాలు పొందని వారు అర్హులన్నారు. సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకో వాలన్నారు. అలాగే ప్రభుత్వ స్థలాలను ఆక్ర మించి నిర్మాణాలు చేపట్టిన స్థలాలను క్రమ బద్ధీకరిస్తామన్నారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రీను పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అదనపు సాయం

బాడంగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మించుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు సాయం చేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు, గిరిజనులకు రూ.లక్ష సాయం అందించనుందన్నారు. పీఎంఏవై బీఎల్సీ 1.0 కింద ఇప్పటికే మంజూ రైన ఇళ్లకు సాయం లభించిందని, దీనికితోడు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు జీరో వడ్డీపై రూ.35వేలు అందిస్తారని తెలిపారు. దీనిపై ఇంజినీరింగ్ సహాయకులు, హౌసింగ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఇలాంటి ఇళ్లు 89 ఉన్నాయని, వీటికి ఇంజినీరింగ్ సహాయకులు ఫొటో క్యాప్చర్ చేసి స్టేజ్ అప్డేషన్ చేస్తారని చెప్పారు. ఈవోపీఆర్డీ, హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.

బొబ్బిలి మండలానికి 96 బీసీ రుణాలు

బొబ్బిలి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలానికి 96 బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరైనట్టు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలకు 94, ఈబీసీలకు 2 సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రైస్ కార్డు ఉన్న 21 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న బీసీ, 21 నుంచి 50 లోపు ఉన్న కాపు అభ్యర్థులు(ఈబీసీ) ఈ రుణాలకు అర్హులని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22 తేదీ వరకూ ఓబీఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

బొబ్బిలి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాశిందొరవలస పంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న ఫారం పాండ్‌ను ఎంపీడీవో పి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. ముందుగా కూలీల మస్తరు షీట్‌ను తనిఖీ చేశారు. ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసి, గరిష్ఠ వేతనాన్ని పొందాలని కూలీలకు సూచించారు. ఏపీవో లక్ష్మీపతిరాజు, టెక్నికల్ సహాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా
పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా
ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

వ్యాను ఢీకొని ఒకరికి గాయాలు

బొబ్బిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఫ్లైఓవర్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణప్పవలసకు చెందిన గేదెల శంకరరావు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫీల్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తన భార్యను శంకరరావు బైకుపై మండల పరిషత్ కార్యాలయం నుంచి స్వగ్రామానికి తీసుకెళ్తున్నారు. ఫ్లైఓవర్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న చేపల వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరరావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందజేస్తున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బొబ్బిలిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

బొబ్బిలి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డొంగురువలస ఎంపీపీ పాఠశాలను ఎంపీడీవో పి.రవికుమార్ బుధవారం సందర్శించారు. పాఠశాలలో వంటగదిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూ శారు. విద్యార్థులకు నాణ్యమై న ఆహారాన్ని, మెరుగైన విద్యను అందించాలని ఆయన హెచ్ఎంకు సూచించారు.





మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలి

బొబ్బిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సంఘ నాయకుడు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావును కలిశారు. మాజీ సైనికులకు బొబ్బిలిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి ఎ.గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి, చెన్నై-600032. నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవెల్ 2), భవనం సంఖ్య 02, బిరం బ్యూ పార్క్ జనరల్4/1, TTC, థానే బేలాపూర్ రోడ్, ఘన్సోలి, నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTION DATE 22.03.2025,SHRIRAM FINANCE LTD,D.NO 5-162,1ST FLOOR,MAIN ROAD,CHEEPURUPALLI,VIZIANAGARAM 535128

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
GCHPLPJ2408280002	SANAPATHI TRINADHA RAO		

AUCTION DATE 22.03.2025,SHRIRAM FINANCE LTD,D.no 8-12-5,2ND FLOOR,PSN ESTATE ,LOWER TANK BUND ROAD,VIZIANAGARAM -535003

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
GJPNMPJ2409130001	DASARI VENKATARAMANA	VZNGRPJ2409230001	SAI AADADA
VZGRMPJ2409100002	SANTOSH KUMAR KODURU	VZGRMPJ2406300001	RAJU ITLA
KVLSAPJ2409040002	PRAVALLIKA ARATIKATLA	KVLSAPJ2409240004	GORRIPATI SANNI BABU
KVLSAPJ2409110003	JAMI RAMESH NAIDU	KVLSAPJ2409270005	GOPI JOGA
KVLSAPJ2409200006	RAMAKRISHNA YEDDU	KVLSAPJ2409270002	GOPI JOGA

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ పి.రవి కిరణ్,శ్రీ ఎ.జగదీష్ ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 12.03.2025
స్థలం:శ్రీకాకుళం
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన
ICICI Bank
నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చకిలీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051
బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన
తేదీ: 13.03.2025
సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

బహిరంగ ప్రకటన
ICICI Bank
నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చకిలీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051
బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన
తేదీ:13.03.2025
సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున